# గుట్టలో యాదగిరీశుడి తిరుకల్యాణం


యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మొదటగా సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నరపాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం నారసింహుడిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను తెల్లవారుజామున సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా నిర్వహించారు. కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శివాలయ మాఢవీధుల్లో రామలింగేశ్వరుడి సేవను ఊరేగించారు. స్వామివారిని 13 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 21,10,125 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామివారి సేవలో త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సతీసమేతంగా పాల్గొని తరించారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

### 14నుంచి కార్తీక మాసం వేడుకలు

లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వరకు కార్తీక మాసం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.గీత వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరమ పవిత్రమైన మాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం కొండకింద వ్రత మండపంలో 4 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని, వీటిని మార్పు చేస్తూ కార్తీక మాసాంతాన 6 బ్యాచ్‌లను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 27న 8 బ్యాచ్‌లలో వ్రతాలు జరుగుతాయని, రూ.800(దంపతులు) రుసుముతో నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో https://yadadritemple.telangana.gov.in గానీ టికెట్లను బుక్ చేసుకునే వీలున్నట్లు తెలిపారు. పాతగుట్ట ఆలయంలో 5 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

# నకిరేకల్‌లో ఎగిరేది గులాబీ జెండానే

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- బీఆర్‌ఎస్‌లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల చేరిక


నకిరేకల్ : చేరికల సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి, పక్కన ఎంపీ బడుగుల

నకిరేకల్, నవంబర్ 6 : నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం వీరచరిత్ర అందరికీ తెలుసునని, ఆయనదంతా డార్క్ రూమ్‌లో సెటిల్‌మెంట్ల దందా అని, ఎదురుతిరిగిన వాళ్లపై దాడులు చేసే వ్యక్తి అని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. సోమవారం నకిరేకల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఓడించేందుకు ఖమ్మం, నల్లగొండ, మునుగోడు నుంచి వేల కోట్లు నకిరేకల్‌కు చేరుతున్నాయని పేర్కొన్నారు. తాను నకిరేకల్ పట్టణానికి ఐదేండ్లలో రూ.135 కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేశానని, వీరేశం తన కాలంలో రూ.5 కోట్లు కూడా తేలేకపోయాడని విమర్శించారు. కిరాయి మర్డర్లకు కేరాఫ్‌గా నిలిచిన ఆయనకు ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు, మహిళలపైనా దాడులు చేశారని గుర్తుచేశారు. నియోజకవర్గ ప్రజలు వీరేశానికి రాజకీయ సమాధి కట్టనున్నట్లు తెలిపారు. వీరేశం ఎన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నకిరేకల్‌లో గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నుంచి నాయకులు పోయినా నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వైపే ఉన్నారన్నారు. చిరుమర్తిపై ఈగ వాలినా పేదవర్గాలు ఊరుకోవని హెచ్చరించారు. చిరుమర్తి గెలుస్తడని సర్వేలు చెబుతున్నాయని, ఓర్వలేని కొందరు చిరుమర్తిపై దౌర్జన్యం చేయడం, అబద్ధాలు ఆడడం తగదన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి చిరుమర్తిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బొడ్డుపల్లి శ్రీను హత్యకు కారణమైన వాడిని, గుండ్రాంపల్లిలో మహిళను ఉరికించి కొట్టినోడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేట్ తాకనీయమంటున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. అది నీ అయ్య జాగీరా? అని ప్రశ్నించారు. వందల కోట్ల కాంట్రాక్టుల కోసం రోజుకో పార్టీ మారింది మీరు కాదా? అని అన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మకుండా కారుగుర్తుకు ఓటు వేసి చిరుమర్తి లింగయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి మల్లేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ మురారిశెట్టి కృష్ణమూర్తి, కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి, పాలెం సర్పంచ్ ఏకుల కవితావిజయ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, ప్రధాన కార్యదర్శి కేశవరాజు, పట్టణాధ్యక్షుడు సైదిరెడ్డి, కొండ జానయ్య పాల్గొన్నారు.


కట్టంగూర్ : గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే చిరుమర్తి

### 400 మంది బీఆర్‌ఎస్‌లో చేరిక..

నకిరేకల్ పట్టణంలోని 1, 5 వార్డుల నుంచి 300 మంది, పాలెం గ్రామం నుంచి 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేశారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీలో చేరిన వారిలో ముద్దం బాలరాజు, అనుములపురి శ్యాంప్రసాద్, చింతకాయల ప్రవీణ్, నల్లగొండ రమాకాంత్, దిండుగుల లింగయ్య, అమరాజుల శంకర్, కల్లేపల్లి శ్రీకాంత్, ముద్దం రాంబాబు, ముద్దం వెంకన్న, దిండుగుల వెంకన్న, భిక్షం, మహేశ్, లింగయ్య, శ్రీను, నవీన్, సైదులు, ముద్దం బాలమ్మ, లక్ష్మమ్మ కె.వెంకన్న, కె.యాదగిరి, ఎన్. వెంకన్న, ఆర్.శేఖర్, సీహెచ్.వెంకన్న, ఆర్.లక్ష్మయ్య, జితేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మురళీ, భాగ్యరాజు, గోవర్ధన్, ఉదయ్, యల్లయ్య, రామచంద్రు, వినయ్, వినోద్, వెంకటేశ్ ఉన్నారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాములకు చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చేరిన వారిలో రామస్వామి, సైదులు, శ్రీను, సైదులు, మారయ్య, ఎల్లయ్య, వెంకన్న ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, బెల్లి సుధాకర్, బెల్లి రవి పాల్గొన్నారు.


మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

# సూర్యాపేటలో బీజేపీకి షాక్

- బీజేపీకి గుడ్‌బై చెప్పి బీఆర్‌ఎస్‌లో చేరిన శేషగాని నరేశ్‌గౌడ్‌తోపాటు ఆయన అనుచరులు
- తాజాగా ఆత్మకూర్, సూర్యాపేట మండలాల్లో జోరుగా చేరికలు

సూర్యాపేటటౌన్, నవంబర్ 6 : సూర్యాపేట నియోజకవర్గంలో కారు దూకుడు మీదున్నది. బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రచారంలో దూసుకెళ్తుండగా గులాబీ దళం ఊరూరా కలియతిరుగుతున్నది. జనంతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. వివిధ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కారుకు జై కొడుతున్నారు. తాజాగా ఆత్మకూర్.ఎస్ మండలం తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన బీజేపీ నాయకులు లక్ష్మణ్, లింగరాజు, ఎల్లయ్య, ఏడుకొండల్, సాయికృష్ణ, మధుసూదన్‌తోపాటు గాంధీనగర్‌కు చెందిన మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు, సూర్యాపేటలోని 43వ వార్డుకు చెందిన బీజేపీ నాయకుడు శేషగాని నరేశ్‌గౌడ్‌తోపాటు అతని అనుచరులు 300 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే సూర్యాపేట మండలం రామన్నగూడెం సర్పంచ్ కత్తుల మల్లయ్య తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాయాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- పార్టీ మారిన వారికి తగిన బుద్ధి చెప్పాలి
- కోదాడ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మోతె, నవంబరు 6 : బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోదాడ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని రాఘవపురం ఎక్స్ రోడ్డు వద్ద శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ మారిన వారికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళికను ప్రచారం చేసి మండలంలో మల్లయ్య యాదవ్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ మారిన ద్రోహులను ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పైరవీలకు తావు లేకుండా పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కోదాడలో మల్లయ్యయాదవ్ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. మండలంలో 10 వేల మెజార్టీ వచ్చేలా పని చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. నాడు సాగుకు తీవ్ర ఇబ్బందులు పడిన ఈ మండలానికి కాళేశ్వరం జలాలు తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా అందించనున్నట్లు తెలిపారు.

# బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం : ఎమ్మెల్యే భగత్

- 65 కాంగ్రెస్, బీజేపీ కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిక


హాలియాలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న తిరుమలగిరి సాగర్ మండలంలోని కొంపల్లి, నేతపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు

హాలియా, నవంబర్ 6 : వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. సోమవారం హాలియాలో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ సమక్షంలో తిరుమలగిరి(సాగర్) మండలం నేతాపురం గ్రామానికి చెందిన 35 కాంగ్రెస్, బీజేపీ కుటుంబాలు, కొంపల్లికి చెందిన 30 కుటుంబాలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చాక రైతుబంధు పథకాన్ని రూ.16వేలకు పెంచడంతోపాటు రూ.400లకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికీ రేషన్ ద్వారా సన్నబియ్యం, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బయ్య రవీందర్‌తోపాటు పలు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మండలాధ్యక్షుడు పిడిగం నాగయ్య, ఎంపీటీసీ భార్గవీశ్రీనివాస్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు రమేశ్‌నాయక్, పోతుగంటి తిరుమల్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మొగిలయ్య, శ్రీనయ్య, గోవిందరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.